# తెలంగాణ కవితా వైతాళికుడు కాళోజి నారాయణరావు

డా॥బోనాల మురళి,

అధ్యాపకుడు, తెలుగు శాఖ,

యూనివర్సిటి పి.జి. కళాశాల,

ఉస్మానియా విశ్వవిద్యాలయం, సికింద్రాబాద్.

తెలంగాణ వైతాళికుడు కాళోజి నారాయణరావు, ప్రజాకవి రచయిత ఉద్యమసారథి, అన్యాయం పై ధర్మాగ్రహం ప్రకటించిన నిత్య చైతన్యశీలి. జీవితమే ఉద్యమంగా, ఉద్యమమే ఊపిరిగా జీవించిన మహామనిషి, రాజీ ఎరుగని తత్వం, ఆధిపత్యాన్ని ప్రశ్నించే స్వభావం ఆయన సొంతం. అందుకే తెలంగాణా సాహిత్య – సాంస్కృతిక చరిత్ర అని చెప్పేటంతగా తెలంగాణతో కాళోజి జీవితం పెనవేసుకుపోయింది. తన సమకాలీన తరాలకే కాదు, ఈ తరం వాళ్ళకు సైతం ఆయన జీవన శైలి మార్గదర్శకం అయి నిరంతరం పోరాడటానికి స్ఫూర్తిదాయకంగా నిల్చింది.

కాళోజి తన కవిత్వం ద్వారా నిరంతరం ప్రజలను అప్రమత్తం చేసి వారిని కార్యోన్ముకులను చేసేవాడు. ఆయన రాసిన వచన కవితా పంక్తులకు, మహోన్నతమైన స్థానాన్నిచ్చి, ప్రజలు ప్రేమతో, అభిమానంతో ఆయనను 'ప్రజాకవి' గా పిలుచుకున్నారు. కవిత్వాన్ని ఆయుధంగా మలుచుకున్న ఆయన కలంలోని, ఆ కలపు సిరా చుక్కలలోని ధీరత్వం, లొంగనితనం, ప్రజలు గుండెలను హత్తుకునేటట్టుగా చేసింది. ఆయన కవిత్వం "కేవలం కవిత్వం కోసమే కాదు, కవిత్వం ప్రజల కోసం" అని నిరూపించిన సాహసి కాళోజి.

కరుడుగట్టిన సాహిత్య విలువలను పెంపొందించుకొని తన మార్గం ప్రజామార్గం అని అదే మార్గాన్ని తనకు తెలియకుండానే ఎంచుకొని – తన కవిత్వాన్ని ప్రజల జీవితాల్లోకి తీసుకెళ్ళి ప్రజాకవిగా

పేరొందినవాడు కాళోజి. కాళోజి సామాజిక జీవితం, ఉద్యమాలు, సంఘర్షణలు, ఆవేదన – అన్ని ఆయనకు కవితాత్మగా మారి కాళోజి జీవితం అంత ఒక కవిత్వోద్యయం అయింది.

కాళోజి తన గూర్చి, తన కవితా స్వభావంను గూర్చి, తన రచన ఆయన 'నా గొడవ" అనే కవితలో స్పష్టంగా వివరించాడు. ఆ కవిత్వానికి 'నా గొడవ' అని పేరు పెట్టినగాని అది కేవలం కాళోజి గొడవ కాలేదు. అది ప్రజాగొడవ, ఇది సామాజిక గొడవ. ప్రజలందరి బాధలకి, ఆవేదనలకి, ఆలోచనలకి సామాజిక కంఠం 'నా గొడవ' కవిత.

కాళోజి 1940 సం॥ భారతదేశంలో జాతీయోద్యమం ఉద్యమాలుగా సాగుతున్న కాలంలో దాని ప్రభావానికి లోనై తనలోని దేశభక్తిని 'మాతృదేశం' అని కవిత ద్వారా వ్యక్తం చేశాడు.

తల్లి ఏడుపు తండ్రి కోపము / భార్యాబిడ్డల ప్రణయ పాశము

ఇంచుకైనా గణింపనీయదు / మాతృదేశము మాతృదేశమే

లాఠీ దెబ్బల లక్ష్యమేమి / కఠిన శిక్షయె కాదు కాదు

చావుకైనను జంకనీయదు / మాతృదేశము మాతృదేశమే.... అంటూ

కాళోజి తన కవిత్వంలో అవిరళ దేశభక్తిని ప్రకటించాడు.

దేశ సామాజిక వ్యవస్థలోని ధనిక, పేద వర్గాల వ్యత్యాసాలను గురించి తన మనసులోని బాధను వ్యక్తం చేస్తూ –

అన్నపురాసుల ఒక చోట

ఆకలి మంటలు ఒక చోట

హంస తూలికలొక చోట

అలసిన దేహాలొక చోట

... అంటూ కాళోజి లోకంలోని నిజాల్ని హృద్యంగా వర్ణించి చెప్పాడు.

కాళోజి తెలుగు భాషా గొప్పతనం గురించి, దాని యొక్క ఔనత్యం గూర్చి తెల్పుతూనే, నేడు తెలుగు ప్రజలు తెలుగు భాష పట్ల చూపే నిరాదరణను చూసి సహించలేక, తీవ్ర ఆవేశానికి లోనైనాడు. తెలుగు ప్రజలు ఆంగ్ల భాషా వ్యామోహంలో పడిపోయి తన మాతృభాషను మృత భాషగా మారుస్తున్నారని ఆవేదన చెంది, తన ఆవేదనను తన "ఆంధ్రుడా" అనే కవిత రూపంలో 1942లో వ్యక్తం చేశాడు.

'ఏ భాషరా నీది యేమి వేషమురా?

ఈ భాష ఈ మేష యెవరి కోసమురా?

ఆంగ్ల మందున మాటలాడ గలుగగనే

ఇంతగా గుల్కెదవు ఎందుకోసమురా?

సూటూ బూటు హ్యాటు షోకుగా దొడుగ

ఘనత యేమి వచ్చెరా గర్వమేటికి రా?

తెలుగు బిడ్డవురోరి తెలుగు మాట్లాడుటకు

సంకోచపడియెదవు సంగతేమిటిరా?

అన్య భాషలు నేర్చి ఆంధ్రంబురాదంచు

సకిలించు ఆంధ్రుడా! చావవెందుకురా?"

అంటూ ఈ కవితలో తీవ్ర ఆవేశానికి లోనై కాళోజి స్వాభిమానాన్ని చాటి చెప్పాడు. తన భాష ఎడల, వేషం ఎడల, ఈ ప్రాంత సంస్కృతి ఎడల కాళోజికి గల ప్రేమను ఈ కవిత చాటి చెబుతుంది. ఈ కవితా ఈ నాటి సమాజానికి కూడా మార్గదర్శకంగా ఉంది.

ప్రపంచంలోని బాధలను, కన్నీళ్ళను చూచి కవిగా కాళోజీ హృదయం ద్రవించి, ఆ హృదయ ప్రకంపనలకు అక్షర రూపం కల్పిస్తూ నూతన పోకడలతో కవిత రూపంలో వ్యక్తం చేశాడు.

అవనిపై జరిగేటి అవకతవకలు జూచి

ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు

పరుల కష్టము జూచి కరిగిపోవును గుండె

మాయ మోసము జూచి మండిపోవును ఒళ్ళు

పతిత మానవునిజూచి చితికిపోవును మనసు

ఎందుకోనా హృదిని ఇన్ని ఆవేదనలు?".... అంటూ

కాళోజి ఆత్మాశ్రయ ధోరణిలో తన మనసులోని బాధను వ్యక్తీకరించాడు.

ఎల్లవేళల సిద్ధాంతం, సిద్ధాంతం అంటూ రాద్ధాంతం చేసే మూర్ఖుస్టులను, సిద్ధాంతాలు ఫ్యాషనైపోవడాన్ని, 'విప్లవం, శాంతి, క్రాంతి' అంటూ పదే పదే మాట్లాడే సోషలిస్టుల్ని తన కవిత్వంలో తూర్పారబట్టుతూ–

పరిస్థితుల సాకుతో / సత్యమైన నీ జీవిత రంగంలో

నిత్యం దాసాను దాసుడవై / నానా గడ్డి కరుస్తూ

మోచేతి గంజి గతుకుతూ / బాపూ! బాపూ! అన్నా

మావో! మావో! అన్నా / సర్వదయమన్నా

విల్లెమన్నా / క్రోధం, రోధం అన్నా

శాంతమన్నా, క్రాంతమన్నా / వట్టి తాలుకన్నా

తీలికైన బాతాలు / అయ్యోరాత!

రాతకేం ఏమైనా రాయవచ్చు – అంటూ వట్టి పనికి మాలిన మాటల్ని కవిత్వంలో రాస్తూ, వాటి ఆచరించక, వేరేవారికి హితబోధ చేసే వారిని తన కవిత్వంతో విమర్శించాడు.

నిజాం ప్రభుత్వంలోని రజాకార్ల ఆగడాలను సహించక, వారి అమానుష చర్యలను నిరసిస్తూ, ఈ దురాగతాలకు వ్యతిరేకంగా కాళోజి "నగ్న సత్యాలు" అనే కవితను రాశాడు.

ఉత్తమాటలు కట్టిపెట్టి / పెత్తనాలకు దేవులాడక

చిత్తశుద్ధిగా చేయబూనిన / చేతలెల్ల ఘటించినట్లే

న్యాయమును పాటింపనొల్లని / ఆధిపత్యము అండయుండిన

హత్య, దోపిడి, మన భంగాల్ / నిత్య కర్మల చేరినట్లే

అంటూ నిజాం ప్రభుత్వంపై నిప్పులు కురిపిస్తూ, తన కవిత శంఖంను ఊది, కదన రంగంలో రాజకీయ జీవితంలో, ప్రజా ఉద్యమాలలో ముందుంటూ తన అంకిత భావాన్ని ప్రదర్శించాడు కాళోజి.

కాళోజి ప్రతి విషయానికి స్పందించే హృదయం గలవాడు. కేవలం ప్రాంతీయ, దేశీయ విషయాలే కాదు – అంతర్జాతీయ విషయాలకు కూడా అదే స్థాయిలో స్పందించాడు.

ఉద్యమకారుల మధ్య ఉండే అనైక్యతను ఆసరాగా చేసుకొని పాలకులు తమ అవినీతి, రాజ్యహింసను చూసి, దేశంలో, రాష్ట్రంలో ఈ పరిస్థితిని చూసి చలించిపోయిన కాళోజి, ఉద్యమాల మధ్య, ఉద్యమకారుల మధ్య సమైక్య భావాన్ని కోరుతూ, వీళ్ళంతా కలిసి అవినీతి చీకట్లను, రాజ్యహింసలను పారద్రోలాలని తపించి 'లోటు' అనే కవితలో ఈ విధంగా రాశాడు.

ప్రమిదలు కోటాను కోట్లు / వత్తులు కోటాను కోట్లు

శాంతి జ్యోతి వెలిగింపగ / సమిధులు కోటాను కోట్లు

చీకట్లను పారద్రోల / చేష్టలు కోటానుకోట్లు

వెలగే వెలగక మున్నె / విరగబడి చల్లార్పగా

మిడతలు కోటానుకోట్లు

అంటూ తన కాళోజి తన ఆవేదనను వ్యక్తం చేస్తూ, ఐక్యతను కోరుకుంటూ తన కవితను వ్రాయడం జరిగింది.

కాళోజి తన యొక్క కవిత స్రవంతిలో తన ప్రతిభను, సృజనాత్మకతను జోడించి కవిత లోకంలో, సమాజంలో అన్ని కోణాలను స్పృశిస్తూ, సామాజిక అంతరంగాలను తొలగిస్తూ తన అభిప్రాయాలను, నిర్మోహమాటంగా, నిర్భయంగా ప్రజల ముందు ఉంచినాడు. మార్పులు, కాంక్షించాడు మనకే అతను నేటి ప్రజాకవిగా, ప్రజల హృదయాలలో స్థానం సుస్థిరతం చేసుకున్నాడు.

ఆధార గ్రంథాలు

1. కాళోజి ముచ్చట్లు – రామశాస్త్రి, నాగిళ్ళ (2004) – కాళోజి ఫౌండేషన్ వరంగల్,

2. కాళోజీ యాదిలో – ప్రభాకర్ టి.

3. నా గొడవ (కవితలు) – కాళోజి నారాయణరావు

4. కాళోజి నారాయణ రావు షష్టిపూర్తి అభినందన సంచిక – శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, సుల్తాన్‌బజార్.

5. కాళోజి నారాయణ రావు షష్టిపూర్తి అభినందన సంచిక – జనధణ – వరంగల్

6. కాళోజి – దాశరథి కృష్ణమాచార్యులు – సాహిత్య అకాడమి, రవీంద్ర... ఫిర్‌జాద్‌రోడ్, న్యూ ఢిల్లీ.

7. కాళోజీ జీవితం – సాహిత్యం – తూర్పు మల్లారెడ్డి.